క్లుప్తంగా

ఘనంగా ద్వారం ప్రతిష్టాపన

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు కణితి రామాలయం వద్ద నిర్మాణంలో ఉన్న పంచ ముఖలింగేశ్వరస్వామి ఆలయ ప్రధాన ద్వారం ప్రతిష్టాపన కార్యక్రమాన్ని సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తొలుత ద్వారబంధానికి పూజలు నిర్వహించి తర్వాత ప్రతిష్టించారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డ గోవింద్, నాయకులు ప్రగడ వేణుబాబు, బొడ్డ సన్యాసిరావు, ప్రగడ శంకరరావు, దుగ్గపు దానప్పలు, పూడి శ్రీను పాల్గొన్నారు.

60 బస్తాల బియ్యం అందజేత

అగనంపూడి: దానవ్వతల్లి ఆలయం సారె, ముర్రాట కార్యక్రమంలో అన్న సమారాధనకు సహకారం అందించిన హెచ్‌పీసీఎల్ చీఫ్ మేనేజర్ దుగ్గపు సత్యనారాయణ, ఆయన తండ్రి నరసింహులను ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఘనంగా సత్కరించారు. 60 బస్తాల సన్న బియ్యం అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో దుగ్గపు వెంకట అప్పారావు, బొడ్డ సన్యాసిరావు, గోవింద్, పిన్నింటి సంతోష్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి భార్య సోమవారం ఉదయం నుంచి కనిపించడం లేదని స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాలు.. స్టీల్‌ప్లాంట్‌లో చార్జ్‌మెన్‌గా పని చేస్తున్న చిత్రాసేన్ తరయ్ తన భార్య అనిత తరయ్, కుమారుడు అర్మన్ తరయ్‌తో సెక్టార్-1లోని 45ఎ క్వార్టర్‌లో నివసిస్తున్నారు. కాగా సోమవారం ఉదయం చిత్రాసేన్ తరయ్ తన కుమారుడిని స్కూల్‌లో దింపడానికి వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంటికి తాళం వేసి ఉంది. భార్య అనిత తరయ్ కనిపించలేదు. ఆమె కోసం చుట్టుపక్కల వెతికినా కనిపించక పోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ తాతారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జిమ్ పరికరాలతో శివలింగం



శివలింగానికి పూజలు చేస్తున్న ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: దేహధారుఢ్య పరికరాలు దేవదేవుడి రూపాన్ని ప్రతిబింబించాయి. భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ఆర్కే షేప్ ఫిట్నెస్ జిమ్‌లో ప్రతినిధులు జిమ్ పరికరాలతో శివలింగాన్ని ప్రతిష్టించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. కోచ్ బర్ల రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిమ్ సభ్యులు శ్రీకాంత్, సాయి కృష్ణ, సత్య, అనిల్, అశోక్, రామ్, నితిన్ పాల్గొన్నారు.

గోవా మద్యం బాటిళ్ల స్వాధీనం

గాజువాక: గోవా నుంచి అక్రమంగా తీసుకొచ్చిన ఆరు మద్యం బాటిళ్లను గాజువాక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గాజువాక దశమి కొండ ప్రాంతానికి చెందిన కె.లక్ష్మీ వరప్రసాద్ గోవా నుంచి ఆరు మద్యం బాటిళ్లను తీసుకొస్తుండగా దువ్వాడ రైల్వే స్టేషన్‌వద్ద పట్టుకొని కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ నాగ శ్రీనివాసరావు తెలిపారు.

ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని వినతి

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు రామచంద్ర నగర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని కోరుతూ రామచంద్రనగర్ గ్రామ కమిటీ సభ్యులు సోమవారం గాజువాక తహసీల్దార్ శ్రీవల్లికి వినతిపత్రం అందించారు. రామచంద్ర నగర్ కాలనీలో 60 చదరపు గజాల స్థలాన్ని మహిళా సాధికార భవనం నిర్మించేందుకు కాలనీ ప్రారంభ సమయంలో కేటాయించారని వివరించారు. ఆ స్థలం పక్కనే ఉంటున్న కుటుంబ సభ్యులు ఆ స్థలం చుట్టూ కర్రలతో దడి నిర్మించారని ఆరోపించారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో భాస్కరరావు, రమణ, రమేష్, కమలాకర్‌రావు, బీఎస్ రావు, ఎస్.రమణ ఉన్నారు.

పదో తరగతి పరీక్షలపై అవగాహన సదస్సు నేడు

గాజువాక: పదో తరగతి పబ్లిక్ పరీక్షలపై మంగళవారం టీఎన్నార్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.శ్రీనివాసరావు, షణ్ముఖరావు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మరువలేఖ..





తోకలేని పిట్ట 90 ఊళ్లు తిరిగింది.. అది ఏంటి అని అడిగిన వెంటనే ఉత్తరం అని సమాధానం వచ్చేది. అయితే ఇప్పుడు ఈ మాట చెప్పుకునేందుకు తప్పా ఉత్తరం రాసేవారే కరవయ్యారు. పోస్ట్ అని ఇంటిముందు పోస్ట్‌మన్ కేక వేయగానే ఉత్తరం అందుకునేందుకు పరుగున వచ్చేవారు..తమ బంధు మిత్రులు అందించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు ఉత్తరాల కోసం ఎదురు చూసేవారు. మంచి విషయాలు, కీలక ఘటనలు ప్రస్తావించిన ఉత్తరాలను భద్రంగా దాచుకునేవారు..అవి ఇప్పుడు మధుర జ్ఞాపకాలుగా మిగిలి పోయాయి. – పెదగంట్యాడ

- మధుర జ్ఞాపకాలు మిగిల్చిన ఉత్తరం
- ఒకప్పుడు తంతి తపాలా ద్వారానే సమాచారం
- వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ రాకతో ఉత్తరం కనుమరుగు



స్మార్ట్ ఫోన్ రాకతో ఉత్తరాల ఊసే లేదు

ఉత్తరాలు రాసుకునే రోజుల్లో శ్రీవారికి ప్రేమలేఖ ఇలా ఎన్నో సినిమాలు తీశారు..అవి ప్రేక్షకులను సైతం విశేషంగా అలరించాయి.. నేటి యువత చేతిలోకి వచ్చిన స్మార్ట్‌ఫోన్లను గంటల తరబడి వాడుతున్నప్పటికీ అవతలి వారి యోగక్షేమాలను అడిగే పరిస్థితి లేదు. ఒకటి రెండు మాటలు మాటలు మాట్లాడిన తర్వాత ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఇలా వేరే వ్యాపకాలకు మొగ్గు చూపుతున్నారు. ఉత్తరాలు రాసే సమయంలో మరో ఉత్తరం వచ్చేంత వరకూ ఎదురు చూపులు ఉండేవి. సమయం లేక రాయలేని వారికి ఉత్తరం రాసి చాలా రోజులైందని దిగులు ఉండేది.

కనుమరుగవుతున్న ఉత్తరాలు



ఉత్తరాలు కనుమరుగవుతున్నాయి. పోస్ట్‌మన్ కోసం ఎదురు చూసే రోజులు లేవు. ఉత్తరాలు రాసేటప్పుడు వాటిలో ఎలాంటి తప్పులు దొర్లాయి అనే విషయాన్ని ఉత్తరం చదివే వారు గుర్తించే వారు.తెలిసిన వారు ఇలా రాయకూడదు.ఇలా రాయాలి అని చెప్పేవాళ్లం. దీంతో రాసిన వారు తప్పులు సరిదిద్దుకునే అవకాశం ఉండేది.తెలుగు భాష పై పట్టు ఉండేది..నేడు ఉత్తరం రాసే పని లేకుండా పోయింది..ఇదంతా స్మార్ట్‌ఫోన్ల పుణ్యమే.

– కులుకూరి పద్మావతి, కర్ణవానిపాలెం, పెదగంట్యాడ

ఆత్మీయత.. అనురాగం కలబోత



ఉత్తరంలో పలకరింపులు, ఆత్మీయత పంచే మాటలు మనస్సును ఆకట్టుకునేలా ఉండేవి..పెద్దలైతే మహారాజశ్రీ, పూజ్యులైన అని.. చిన్న వారు అయితే చిరంజీవి..మహిళలను లక్ష్మి సమానురాలైన అని సంబోధించేవారు.. అలాగే ఉత్తరం ప్రారంభం, ముగింపులో పెద్దలకు అయితే నమస్కారాలతో అని, చిన్న వారికి ఆశీస్సులతో అని రాసేవారు. ఎవరైనా కాలం చేసిన వారి వార్తను ఉత్తరంలో రాసేటప్పుడు ఒక వైపున నలుపు రంగు ఉండేలా చూసేవారు. పెద్దలు గమనించి ఈ ఉత్తరాన్ని ఇంట్లోకి తీసుకెళ్లకుండా బయటే చదివి చింపివేసేవారు. ముఖ్యమైన సమాచారం ఉండే లేఖలను జాగ్రత్తగా దాచుకునేవారు..

మనస్సుకు హత్తుకునేలా ..

పోస్టులో వచ్చిన ఉత్తరం చదువుకుని ఎంతో తృప్తి పడేవారమని నేటి తరానికి పెద్దలు చెబితే..లేఖలు ఏమిటి అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక విప్లవంలో ఉత్తరం కనుమరుగైంది. నేడు ముఖాముఖిగా వాట్సప్ కాల్‌లో మాట్లాడే స్థాయికి చేరాం.

నాడు వేలల్లో కార్డులు ప్రింట్

నాడు గాజువాక నియోజక వర్గ పరిధిలో ఏడాదికి వేలల్లో పోస్టల్ కార్డులు ప్రింట్ చేసేవారు.నేడు ఆధునికత సంతరించుకోవడం, స్మార్ట్‌ఫోన్ల వినియోగంతో కారణాలతో పోస్టు కార్డుల సంఖ్య వందల సంఖ్యకు పడిపోయింది.

నాడు ఓ సాధనం



గతంలో ఉత్తరాలు రాసుకుని అందులోని సమాచారం మననం చేసుకుంటూ మరో ఉత్తరం వచ్చే వరకు ఎదురు చూడడం ఎంతో చక్కగా ఉండేది. ఒక రకంగా చెప్పాలంటే గతంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువుల క్షేమ సమాచారాలు తెలుసునేందుకు ఉత్తరం ఒక సాధనంలా ఉండేది. స్మార్ట్ ఫోన్ల రాకతో సమాచార సాధనంగా వినియోగించిన ఉత్తరం కనుమరుగై పోయింది.

– బొడ్డు ఈశ్వర చిట్టి జయలక్ష్మి, నడుపూరు, పెదగంట్యాడ

కరాటే విజేతలకు అభినందన



పతకాలు, ట్రోఫీలతో క్రీడాకారులు

గాజువాక: ఇటీవల ఎండాలో నిర్వహించిన సౌత్ ఇండియా కరాటే పోటీల్లో గాజువాకకు చెందిన క్రీడాకారులు ప్రతిభ ప్రదర్శించారు. పోటీల్లో పాల్గొన్న 38 మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో 11 స్వర్ణ పతకాలు, 26 రజిత పతకాలు, 19 కాంస్య పతకాలు సాధించి సౌత్ ఇండియా టైటిల్‌తో పాటు ట్రోఫీని సాధించారని కరాటే మాస్టర్లు కరణం సన్నీ, ఆనంద్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక అమరావతి పార్కులో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు వారిని అభినందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కృష్ణారావు, రమేష్, మహాలక్ష్మి నాయుడు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల వితరణ



నిత్యావసర సరకులు అందిస్తున్న సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న అగనంపూడి, దువ్వాడ సెక్టార్-1 ఇందిరానగర్‌కు చెందిన రెండు నిరుపేద కుటుంబాలకు సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు నెలకు సరిపడా బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు అందించారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుదే సుశీలా గజేంద్రరావు, సలహాదారు పట్టా రామఅప్పారావు మాట్లాడుతూ ట్రస్ట్‌పై నమ్మకంతో అనేక మంది దాతలు నిరుపేదలకు సహాయ సహకారాలు అందించేందుకు ముందుకు వస్తుండడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ఎం.మస్తాన్‌రెడ్డి, ఉక్కు అధికారి మద్దూరి ఉమామహేశ్వరరావు, ప్రతినిధులు గంధోళి నరసింగరావు, శీరంశెట్టి గోవిందరావు, బొండా ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గాజువాక: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గాజువాక శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు చిత్రలేఖనం, ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి బి.చంద్రకళ, గాజువాక హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె.విజయ ప్రశాంతి పోటీలను పర్యవేక్షించారు.

రైల్వేస్టేషన్ బస్టాప్ వద్ద అంధకారం

గందరగోళంలో ప్రయాణికులు



చీకట్లోనే బస్టాప్ వద్ద ప్రయాణికులు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం వైపు ఉన్న బస్టాప్ వద్ద అంధకారం నెలకొంది. రాత్రి 7.30 గంటలకు జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో వచ్చిన ప్రయాణికులు దువ్వాడ రైల్వేస్టేషన్‌లో దిగే సరికి అంతా చీకటిమయంగా ఉండడంతో లగేజీలు, చిన్న పిల్లలతో గందరగోళ పరిస్థితికి లోనయ్యారు. జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో సుమారు 300 మంది వరకు ఇక్కడ దిగుతుంటారు. శ్రీహరిపురం, బీహెచ్‌పీపీ, పెదగంట్యాడ, స్టీల్‌ప్లాంట్, అగనంపూడి, పరవాడ, సబ్బవరం ప్రాంతాలకు చెందిన రైల్వే ప్రయాణికులు ఇక్కడ దిగి ఆటోలు, బస్సులు, సొంత వాహనాల ద్వారా గమ్యస్థానాలకు చేరుకుంటురు. ఎప్పటిలాగే ఈరోజు కూడా దిగిన ప్రయాణికులు అంధకారం నెలకొని ఉండడంతో ఇబ్బందులు పడ్డారు. పార్కింగ్, బస్టాప్, వంతెన వరకు హైమాస్ట్ దీపాలు అమర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

'ఎస్ఎంఎస్'లో ప్రమాదంపై విచారణ చేయండి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్ (ఎస్ఎంఎస్)-2 విభాగంలో ఈ నెల 3న జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని స్టీల్ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి నేతృత్వంలో నాయకులు సోమవారం సీజీఎం (వర్క్స్) యు. శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. టోటల్ మెయింటెనెన్స్ కాంట్రాక్ట్ పనుల్లో పర్మనెంట్ ఉద్యోగులు లేకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నాయకులు ఇ. శ్రీనివాసరాజు, యు. మరిడయ్య, చిన్న అప్పారావు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశం నేడు

అగనంపూడి: పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని ఫిజికల్ డైరెక్టర్లకు స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశం మంగళవారం లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్టు పాఠశాల హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు, రిసోర్స్ పర్సన్లు ఎం.వి.నాగేశ్వరరావు, పి.లక్ష్మి తెలిపారు. పరవాడ, సబ్బవరం మండలాలకు చెందిన జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలు, మోడల్ పాఠశాలలు, కెజీబీవీల ఫిజికల్ డైరెక్టర్లు విధిగా హాజరు కావాలని, అలాగే డ్రస్ కోడ్ తప్పనిసరి అని పేర్కొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెదగంట్యాడ: తుపాను కారణంగా విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సేవలందించిన 77వ వార్డు పరిధిలోని పారిశుధ్య కార్మికులకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సోమవారం దుస్తులు పంపిణీ చేశారు.అన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, నాయకులు పంచకర్ల ప్రసాద్‌బాబు, కాకి బాబు, కాకి శ్రీను, గరికిన మహేష్ పాల్గొన్నారు.

కులగణన లేకుండా కమిషన్ ఏర్పాటు తగదు

8న మాలల సింహగర్జన



సమావేశంలో మాట్లాడుతున్న అంబేద్కర్

ఉక్కునగరం: ఎస్సీ ఉప కులాల వర్గీకరణ అంశంపై కులగణన చేయకుండా కమిషన్ ఎలా వేస్తారని మాల మహానాడు వ్యవస్థాపకుడు కె.బి.ఆర్. అంబేడ్కర్ ప్రశ్నించారు. ఎస్సీ ఉప కులాల వర్గీకరణ అంశంలో ఏక సభ్య కమిషన్‌ను వ్యతిరేకిస్తూ స్టీల్‌ప్లాంట్‌లో మాలల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు ఉప కులాల ఇంపిరికల్ డేటా, కులగణన చేసిన తర్వాత వర్గీకరణ చేయాలని తీర్పు ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. నిర్వాహకుడు బయ్యే మల్లయ్య మాట్లాడుతూ శాస్త్రీయమైన సర్వే చేసిన తర్వాత అందరి ఆమోదంతో వర్గీకరణ చేయాలన్నారు. అనంతరం డిసెంబర్ 8న విశాఖలో నిర్వహించనున్న మాలల గర్జన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో గర్జన నిర్వహణ కన్వీనర్ పతివాడ రాంబాబు, విదశం కన్వీనర్ డాక్టర్ బి. వెంకటరావు, స్టీల్‌ప్లాంట్ మాల నాయకులు పుల్లారావు, మోహన్‌బాబు, డి. సురేష్‌బాబు, ఎల్.వి. రమణ, రామకృష్ణ పాల్గొన్నారు.

పోస్టు కార్డు ఉద్యమంలో మేము సైతం



ఉక్కునగరంలో జరిగిన పోస్టు కార్డు ఉద్యమంలో పాల్గొన్న మహిళలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రారంభించిన పోస్టు కార్డు ఉద్యమంలో సోమవారం ఉక్కునగరం మహిళలు పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ పిలుపు మేరకు జరుగుతున్న 10 లక్షల పోస్టు కార్డుల ఉద్యమం విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగా ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు చేస్తున్న ఉద్యమానికి సోమవారం ఉక్కునగరం మహిళలు మద్దతు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ఆర్థికంగా ఆదుకోవాలని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపివేయాలంటూ పోస్టు కార్డులపై మహిళలు సంతకాలు చేశారు. ఈనెల 27న పాత పోస్టాఫీసు వరకు నిర్వహించనున్న ర్యాలీలో పాల్గొంటామని ప్రకటించారు.

'ఉక్కు'పై ప్రధాని ప్రకటన చేయాలి



మాట్లాడుతున్న ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుడు అయోధ్యరామ్

అగనంపూడి: ఈ నెల 29న విశాఖ వస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విశాఖ ఉక్కును ప్రైవేటీకరించబోమని ప్రకటన చేయాలని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ కోరారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెంలో 1376వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు నెలనెలా జీతాలు తీసుకుంటూ కార్మికులు, కిందిస్థాయి అధికారులను మానసికంగా, ఆర్థికంగా వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు వరసాల శ్రీనివాసరావు, డీసీహెచ్ వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నమో శివరుద్రాయ



వాసవీ పంచాయతన ఆలయంలో పూజలు

గాజువాక: పవిత్ర కార్తీక మాసంలో మూడో సోమవారం పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులతో ఆలయాలు కళకళలాడాయి. వినాయకనగర్ వుడాకాలనీ కాశీ విశాలాక్షి విశ్వేశ్వర సహిత పంచాయతన ఆలయంతో పాటు కణితి రోడ్‌లోని ఏకాంబరాలయం, చట్టివానిపాలెం, చిట్టినాయుడుకాలనీ ఈశ్వరాలయం, అయ్యప్పస్వామి ఆలయాలు, దుర్గవానిపాలెం, గాజువాక గౌరీపరమేశ్వరుల ఆలయాలు, బీసీరోడ్డు సంజీవకాలనీలో శ్రీ భద్రావతి భావనా రుషీశ్వరుల సమేత సత్యనారాయణస్వామి ఆలయాల్లోని పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీనగర్ ప్రాంతంలోని దుర్గానగర్‌లో శ్రీదుర్గా గణపతి సమేత మహాజ్ఞాన సరస్వతి దేవాలయంలో కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉక్కునగరం: కార్తీకమాసం మూడో సోమవారం కావడంతో సెక్టార్-6 శివాలయంలో అభిషేకాలు, పూజలు చేశారు.

- బీసీ గేటు సమీప ఉమాసహిత రామలింగేశ్వర స్వామి ఆలయంలో పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. రుత్వికుల ఆధ్వర్యంలో హోమాలు చేశారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు అప్పికొండ సోమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం పూజలు చేశారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్త రమేష్‌బాబు స్వామిని దర్శించుకున్నారు.

- జీవీఎంసీ 75వ వార్డు నెల్లిముక్కులోని గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో, 76వ వార్డు బాల చెరువు ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు.

ఫీజు డిమాండ్‌పై ఫిర్యాదు



కలెక్టర్ కార్యాలయం వద్ద విద్యార్థులు

మహారాణిపేట: విద్యాహక్కు చట్టం కిందట తమకు ప్రభుత్వం గాజువాక నారాయణ స్కూలులో ఫ్రీ సీటు ఇచ్చిందని, ఇప్పుడు యాజమాన్యం డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం గాజువాక నారాయణ స్కూలు విద్యార్థులు కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. ఆర్టీఈ యాక్టు కింద గతేడాది పుస్తకాలు, యూనిఫారం ఉచితంగా ఇచ్చారని వివరించారు. ఈ ఏడాది ఫీజు చెల్లించాలని అడుగుతున్నారని విద్యార్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించి తమకు న్యాయం చేయాలని విద్యార్థులు కలెక్టర్‌ను కోరారు.